పర్యావరణం.. జీవనాధారం..

- అటవీ శాఖ మిషన్ లైఫ్ కార్యక్రమాలు
- ప్రజలకు విస్తృతంగా అవగాహన



రాజానగరంలో పేరమ్మ చెరువు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు

మధురపూడి: పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని తీసుకోవడం, వనరుల ఆదా చేయడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహనను కల్పించేందుకు కార్యాచరణ చేపట్టింది. దానిలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో వనరుల ఆదా – భవిష్యత్ బాట కార్యక్రమాలు నిర్వహించింది. దానిలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి, నీరు, ఇంధనం పొదుపుగా వాడాలన్న లక్ష్యసాధన కోసం గ్రామీణ ప్రాంతంలో అటవీశాఖ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. మే12న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 5వ తేదీ వరకూ జరిగింది. విద్యుత్ వృథాను అరికట్టడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడమే జీవనశైలిగా ప్రజలు అలవర్చుకోవాలని అవగాహన కల్పించింది. అటవీశాఖ దివాన్ చెరువు సెక్షన్ పరిధిలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం, రంగంపేట మండలాల్లోని ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ర్యాలీ నిర్వహించారు.

వనరుల ఆదాతో మేలు

సహజ సిద్ధమైన వనరులతో పాటు విద్యుత్, ఇంధనం ఆదా చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని అటవీశాఖ ప్రజలకు అవగాహన కల్పించింది. గ్రామాల్లోని సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా పర్యావరణానికి హాని జరుగుతోందని, దాన్ని పూర్తిగా నిషేధించాలని అవగాహన కల్పించారు. ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలని తెలియజేశారు.

నీటి సంరక్షణ, మొక్కలు నాటడం

తాగునీటిని సంరక్షించుకోవడం, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణం పరిరక్షించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటిని ప్రాధాన్యాన్ని తెలియజేసి, మానవాళి వికాసానికి ప్రాణవాయువును విడుదల చేసే మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార పదార్థాలను సూచించారు.

ప్రజల స్పందన బాగుంది



మిషన్ లైఫ్ కార్యక్రమానికి ప్రజల స్పందన బాగుంది. దివాన్ చెరువు సెక్షన్ పరిధిలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం, రంగంపేట మండలాల్లోని కార్యక్రమాలు నిర్వహించాం. మిషన్ లైఫ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మంచి అవగాహన కల్పించగలిగామనే సంతృప్తి లభించింది. – పద్మావతీ దేవి, అటవీశాఖ దివాన్ చెరువు సెక్షన్ డిప్యూటీ రేంజి అధికారి

సందేశాత్మకం



మిషన్ లైఫ్ కార్యక్రమం పేరిట అటవీశాఖ నిర్వహించే కార్యక్రమం సమాజానికి సందేశాత్మకంగా ఉంది. ప్రజల్లో అవగాహన పెరగడం ద్వారా తమ బాధ్యతను గుర్తిస్తారు. ర్యాలీలు నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు, ప్రతిజ్ఞ చేయడం ద్వారా పట్టుదల కలుగుతుంది. సమాజంలోని యువత, విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలి.

– ఇందుగమెల్లి సత్యనారాయణ, పర్యావరణ పరిరక్షకుడు, మధురపూడి

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో రమేష్

సీతానగరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా ఏపీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ గరిమెళ్ల శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, హౌసింగ్ ఏఈ రామారావు పాల్గొన్నారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని పదకొండు గ్రామాల్లో 1,694 మంజూరయ్యాయని, వాటిలో వీటిలో 502 పూర్తయ్యాయన్నారు. 193 పునాదులు, 91 రూఫ్ లెవెల్, 8 స్లాబ్‌లు వేసినవి ఉన్నాయని వివరించారు. ఇంకా పునాది దశలో ఉన్న 885పై ప్రత్యేక దృష్టి సారించి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదిహేను మంది ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదన్నారు. మండలంలో పోషకాహార లోపం కలిగిన పిల్లలు 54 మంది ఉన్నారని, వీరికి బంగారుకొండ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం అందించే దాతలను బాలమిత్రగా పరిగణిస్తామన్నారు. ఆ పిల్లలకు ప్రభుత్వ నుంచి వచ్చే పౌష్టికాహారం కిట్లను ఆరునెలలు అందజేస్తామని తెలిపారు. అలా ఆరునెలలకు రూ.3 వేలు చెల్లించాలని, ఇప్పటికి 25 మంది చెల్లించారని తెలిపారు. సమావేశంలోఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఆర్.సుజాత, ఏపీఓ నాగేశ్వవేణి పాల్గొన్నారు.

అనపర్తిలో ఆధ్యాత్మిక శోభ



విగ్రహాలకు అధివాస పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరులో పునఃనిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు సోమవారం వేదపండితులు శాస్త్రోక్తంగా ఉక్త హోమం, పంచగవ్యాధివాస పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుతీర్చే స్వామి అమ్మవార్ల విగ్రహాలతో పాటు జయ, విజయ, విష్వక్సేన, గరుడ, శ్రీవిఖనస మహాముని, బాల జనార్దన స్వామి పంచలోహ విగ్రహాలకు, బలిపీఠ, విమాన శిఖరాలకు వివిధ ద్రవ్యాలతో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులచే అధివాస పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పంచామృతాలు, వివిధ ద్రవ్యాలతో విగ్రహాలకు అభిషేకాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పూజలు జరుగుతున్న సమయంలో ఆలయ శిఖరంపై ఆకాశంలో గరుడపక్షులు ఎగరటంతో భక్తులు ఆశ్చర్యచకితులయ్యారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, నేషనల్ వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సత్తి విశ్వనాథరెడ్డి, ద్వారంపూడి మంగిరెడ్డి, పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి అండగా ఉంటాం



రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శ్రీను కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: ముప్పిడిశెట్టి శ్రీను కుటుంబానికి అండగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. శ్రీను మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం చేశారు. విజయలక్ష్మి అక్కడకు వచ్చి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావుతో మాట్లాడి శ్రీను హత్య జరిగిన తీరును తెలుసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు. సీఐ మాట్లాడుతూ నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు జరుగుతున్నట్టు తెలిపారు. కోరుకొండ ఉపసర్పంచ్ నేతుల చిన్ని, నాయకులు వాకా నరసింహారావు, బొరుసు బద్రి తదితరులు బాధితులను పరామర్శించారు.

అంత్యక్రియలు

కోరుకొండలోని వెంకటగిరి లైటింగ్, మైక్ సర్వీస్ అధినేత ముప్పిడిశెట్టి శ్రీను అంత్యక్రియలు సోమవారం జరిగాయి. ఆయనపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి, కళ్లల్లో కారం చల్లి హత్యచేసిన సంగతి తెలిసిందే. ఆయనకు భార్య అమ్మాజీ, ఇద్దరు కుమార్తెలున్నారు. శ్రీను మృతదేహానికి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు నివాళులు అర్పించారు. స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో గడప గడపకూ..



నరేంద్రపురంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలందరూ బాగుండాలనే ఆశయంతో ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకమైన పాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. తమ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రభుత్వంలో మాదిరిగా దళారీలు ఉండరని, అర్హత ఉంటే చాలు పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మీ ఆశీసులు అందజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నందరాడ సొసైటీ చైర్ పర్సన్ పబ్బన శ్రీనివాస్, స్థానిక నాయకులు ప్రగడ శివ, రాంబాబు, తంగెళ్ల వీరరాఘవులు, వెంకట్రావు, బేదంపూడి సూర్యారావు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

సీతానగరం: కూలి డబ్బులు తీసుకోవడానికి వెళుతుండగా వెనుక నుంచి బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురం పంచాయతీ పరిధిలోని రవీంద్ర కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ బోకారి సూర్య నారాయణ (65) తన కూలి డబ్బులు కోసం సాయంత్రం 6.40 గంటలకు రఘుదేవపురం వెళుతున్నాడు. కాలనీ పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ముగ్గళ్ల వైపు నుంచి వచ్చిన మోటారు సైకిల్ వెనుక నుంచి అతడిని ఢీకొంది. ఈ ఘటనలో సూర్యనారాయణ తలకు బలమైన గాయమైంది. స్థానికులు సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్దగల ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాములమ్మ, కుమారుడు సురేష్ ఉన్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి వెళ్లారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు తెలిపారు.

పర్యావరణ రక్షణ సమష్టి బాధ్యత

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా పర్యావరణ దినోత్సవం



నరేంద్రపురంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కాటన్ సంచులు పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు బంగారు భవితను అందించాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని నరేంద్రపురంలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా పాల్గొన్నారు.

కాటన్ సంచుల పంపిణీ

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని స్వగృహం వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ సంచులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సమాజాన్ని ప్లాస్టిక్ రహితంగా తయారు చేయడంలో కూడా అందరూ భాగస్వాములు కావాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంతో పాటు వాతావరణంలో భూతాపాన్ని తగ్గించే విధంగా మొక్కలు నాటడం, రక్తదానం, అవయవదానం వంటి కార్యక్రమాలపై ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లంక సత్యనారాయణ, సభ్యులు నరసింహారెడ్డి, వైకేఎల్ ఆకాశం పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవించాలి

పర్యావరణాన్ని కాపాడుకుంటూ, పర్యావరణ హితంగా జీవించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ కడియం నర్సరీస్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. గాలి, నీరు, నేల కాలుష్యాల బారిన పడకుండా కాపాడుకోవడం మన బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించి, జీవనశైలిని మార్చుకోవాలన్నారు. ఈ బాధ్యతలను గుర్తు చేయడమే పర్యావరణ దినోత్సవం, మిషన్ లైఫ్ వంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశాలన్నారు. కడియం పూల మార్కెట్‌లో టన్నుల కొద్దీ వృథా అవుతున్న పూలను రీసైకిల్ చేయాలనే రోటరీ క్లబ్ అధ్యక్షుడు సింగంశెట్టి శ్రీనివాసరావు సూచనలను వీసీ ప్రశంసించారు. ఇందుకు అనుగుణంగా సరైన ప్రణాళికను రూపొందించాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రమణేశ్వరికి సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, క్లబ్ కార్యదర్శి పతంశెట్టి శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ బాగిదరీ కార్యక్రమంలో భాగంగా స్థానిక సిల్క్ హాబ్ ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలు ఈనెల 15 వరకు జరుగుతాయని సంస్థ జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్లు సీహెచ్.నాగకుమారి, ఎం.శాంతికుమారి, స్కిల్ హాబ్ ఇన్‌చార్జి టి.గణేష్ కుమార్ పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, దాసరి బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి డాక్టర్‌బాబు అన్నారు. సోమవారం సీతానగరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు డాక్టర్ సత్యం రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో మొక్కలు నాటారు.

అందరి బాధ్యత

రంగంపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవొచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, కథల పోటీలు నిర్వహించారు. తెలుగు వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై శిక్షణనిచ్చారు. విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీవీ ప్రసాద్, కె.దుర్గాప్రసాద్, నాగేంద్ర, అంజలి పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ



గోకవరంలో ర్యాలీ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది



రంగంపేట గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

గ్రామ సరిహద్దుల్లో చెత్త తొలగించండి

బిక్కవోలు: తమ గ్రామ సరిహద్దులో వేస్తున్న రాయవరం మండలంలోని వెదురుపాక సావారం పంచాయతీ చెత్తను తొలగించాలని కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంకుదురు, వెదురుపాక సావారం గ్రామాల మధ్యలో తుల్య భాగీ నది ఉందన్నారు. వెదురుపాక సావారం గ్రామం నుంచి కొంకుదురు పోలిమేర వరకూ చెత్త తీసుకొచ్చి వేయడంతో నదిలో పూడిక పేరుకుపోతుందన్నారు. దీనివల్ల పొలాలకు మురుగునీరు వచ్చి రైతులకు ఇబ్బంది కలుగుతుందని ఆమె ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: స్థానిక అగ్రహారంలోని కోదండ రామాలయం ముంగిట ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 206 మందికి రక్తం, నీరుడు పరీక్షలు జరిపారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారి కంటి వైద్యశిబిరంలో 87 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 16 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో చంటిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ గ్రామదేవత అంకాలమ్మ జాతర మహోత్సవాలు రెండోరోజు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గరగ నృత్యం, తీన్‌మార్, బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. ఈనెల ఆరు వరకూ ఉత్సవాలు జరగనున్నాయి.

నేడు ఉపాధి హామీ ప్రజా వేదిక

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై సామాజిక ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు తెలిపారు. గత నెల 29 నుంచి ఈ నెల 4 వరకూ గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు పర్యటించి తయారుచేసిన రిపోర్టు గ్రామసభకు సమర్పిస్తారన్నారు. దీనిపై ప్రజా వేదిక ద్వారా సామాజిక తనిఖీ చేస్తామన్నారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారని తెలిపారు.

ఇరువర్గాలపై కేసులు

సీతానగరం: పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఓసీ, ఎస్సీ యువకుల మధ్య రాజంపేట బడ్డీకొట్టు వద్ద ఆదివారం ఘర్షణ జరిగిందన్నారు. రాజంపేటకు చెందిన కటారి సత్యనారాయణ, కటారి సుబ్రహ్మణ్యం, కటారి ఏసు.. మునికూడలికి చెందిన రేలంగి బబ్బుల్, గాడాల దుర్గాప్రసాద్, మురాల బండలపై ఫిర్యాదు చేశారన్నారు. మునికూడలి యువకులు రాజంపేటకు చెందిన పైముగ్గురుపై ఫిర్యాదు అందజేశారన్నారు.

అందరికీ న్యాయం జరిగేలా చూడండి

రాజానగరం: రాష్ట్రంలో 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్త పరిచిందని ఏపీ స్టేట్ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్ కన్వీనర్ డాక్టర్ వి.కనకరాజు అన్నారు. సోమవారం జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సెలింగ్ మీటింగ్‌లో ఈ మేరకు తీసుకున్న నిర్ణయానికి బుధవారం జరిగే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం లభించనుంది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న మిగిలిన ఉద్యోగులందరికీ కూడా న్యాయం జరిగేలా తెలంగాణలో మాదిరిగా ఏపీ ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకుంటే మరింత బాగుంటుందనే ఆకాంక్షను వెలిబుచ్చారు.

బయోమెడికల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయండి



కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందిస్తున్న బయోమెడికల్ పరిశ్రమ బాధితులు

రంగంపేట: రంగంపేట మండలం మర్రిపూడి గ్రామ శివారులో నిర్మిస్తున్న గోదావరి బయో మెడికల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సోమవారం రంగంపేట, పెద్దాపురం, సామర్లకోట మండలాలకు చెందిన మర్రిపూడి, జి.కొత్తూరు, చిన్న బ్రహ్మదేవం, ఆర్బీపట్నం, కొండపల్లి తదితర గ్రామాల ప్రజలు రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కె.మాధవీలతకు వినతి పత్రం అందించారు. ఈ పరిశ్రమ నిర్మాణం వల్ల మూడు మండలాల్లోని ప్రజలతో పాటు, పశువులు అనారోగ్యం పాలవడంతో పాటు, పంట పొలాలు నాశనం అవుతాయని వివరించారు. వినతి పత్రం ఇచ్చినవారిలో రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, వేము చిరంజీవి, మేడిది చక్రం, పుట్టా వెంకటేష్, సీహెచ్ రాంబాబు, ఎ.నానాజీ, బి.వెంకన్నబాబు, ఎ.సోమరాజు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



స్పందనలో వినతి పత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ అమ్మాజీ

రంగంపేట: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమానికి ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. తన డీపట్టా భూమిని షేక్ రెహమాన్ అనే వ్యక్తికి కౌలుకిస్తే, ఇప్పుడేమో స్థలం అమ్మేసినట్టు నకిలీ పత్రాలు సృష్టించి తమను బెదిరిస్తున్నాడని తనకు న్యాయం చెయ్యాలని కోరుతూ కోటపాడు గ్రామానికి చెందిన బరగటి నాగరత్నం ఫిర్యాదు చేశారన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తానని ఆమె చెప్పారు.

అదనపు తరగతుల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు – నేడు ఫేజ్–2కు సంబంధించి రూ.24 లక్షలతో రెండు అదనపు తరగతులను నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, చాటపర్తి దుర్గారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

గోకవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఇందుకూరు రేంజ్ అటవీశాఖ అధికారి వి.దుర్గాకుమార్ అన్నారు. గోకవరం అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పలువురు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. గోకవరంలో పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.